క్లుప్తంగా

న్యాయసేవలను సద్వినియోగం చేసుకోండి

తోటపల్లిగూడూరు : న్యాయసేవాధికార సంస్థ ద్వారా అందిస్తున్న ఉచిత న్యాయసేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి సూచించారు. మండలంలోని పేడూరు గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి వాణి మాట్లాడుతూ జిల్లాలో మోడల్ విలేజ్‌గా గుర్తింపు తెచ్చుకున్న పేడూరు గ్రామంలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశామన్నారు. ఉచితంగా, వేగవంతంగా న్యాయసేవలు పొందేందుకు ప్రభుత్వం 1987లో న్యాయ సేవాధికారి సంస్థ చట్టాన్ని అమల్లోకి తెచ్చిందని, దీని ద్వారా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి, మహిళలకు, వృద్ధులకు ఉచిత న్యాయసేవలను అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎన్జీఓఎస్ సుబ్బారెడ్డి, కవితా రెడ్డి, అడ్వకేట్ కామేశ్వరి, రోహిత్, స్థానిక తహసీల్దార్ లావణ్య, ఎంపీడీఓ హేమలత, ఎంఈఓ జయరామనాయుడు, సర్పంచ్ ఝాన్సీరాణి పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం

కోవూరు : ప్రభుత్వాస్పత్రుల్లో నాణ్యమైన వైద్యసేవలు అందుతున్నాయని డీసీహెచ్‌ఎస్ రమేష్ తెలిపారు. కోవూరు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోవూరు సీహెచ్‌సీకి సీఎస్సార్ నిధుల నుంచి త్వరలో మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో సీహెచ్‌సీల అభివృద్ధికి రూ.1.80 కోట్ల నిధులు మంజూరైందని, అందుకు సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామన్నారు. అందులో కోవూరుకు రూ.40 లక్షలు, ఆత్మకూరుకు రూ.40 లక్షలు, వెంకటాచలంకు రూ.30 లక్షలు, ఉదయగిరికి రూ.15 లక్షలు, వింజమూరుకు రూ.15 లక్షలు మంజూరయ్యాయన్నారు. అలాగే సీహెచ్‌సీలో ఉచితంగా రక్త పరీక్షలు చేస్తున్నామన్నారు. అనంతరం ల్యాబ్‌ను పరిశీలించి పలు రికార్డులు తనిఖీ చేశారు. ఆయన వెంట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజేత, డాక్టర్ పెంచలయ్య, సలావుద్దీన్ ఉన్నారు.

భవిత కేంద్రం దివ్యాంగులకు వరం

మనుబోలు : భవిత కేంద్రం దివ్యాంగుల పాలిట వరమని ఎంఈఓ రమేష్‌కుమార్ అన్నారు. మనుబోలు మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిత కేంద్రంలో ఐఆర్పీలు ఇచ్చే శిక్షణతో దివ్యాంగులు వైకల్యాల నుంచి విముక్తి పొందుతున్నారని తెలిపారు. ఫిజియోథెరపి ద్వారా వారు చేస్తున్న సేవలను కొనియాడారు. ఫిజియోథెరపిస్ట్ నాగరాజు, ఐఆర్పీలు శ్యామల, షర్మిల, సీఆర్‌ఎంటీలు చెంచురామయ్య, స్వరూప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

డీఎస్పీ విచారణ

ఇందుకూరుపేట : అట్రాసిటీ కేసుకు సంబంధించి డీఎస్పీ వీరాంజనేయరెడ్డి మండలంలోని గంగపట్నం గ్రామంలో మంగళవారం విచారణ చేపట్టారు. గ్రామంలోని దళితవాడకు చెందిన ప్రవీణ్‌ను అదే గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులు కులం పేరుతో దూషించడంతో పాటు దాడి చేశారని వారం రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు అందింది. అలాగే అదే గ్రామానికి చెందిన ఆడిపూడి రమ్యమ్మ తనను ఓ వ్యక్తి కులం పేరుతో దూషించడంతో పాటు ఇంటికి వెళ్లే దారిని అడ్డగించారని ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో డీఎస్పీ విచారణ చేపట్టారు.

ఆస్పత్రికి వృద్ధుడి తరలింపు

ఇందుకూరుపేట : బస్‌షెల్టర్‌లో అనాథగా జీవనం సాగిస్తూ తీవ్ర అస్వస్థతకు గురైన ఓ వృద్ధుడిని సచివాలయ పోలీసులు సురేఖ, రేష్మిత, పంచాయతీ కార్యదర్శి టి.జగదీష్ మంగళవారం వైద్యశాలకు తరలించారు. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ఉన్న బస్‌షెల్టర్‌లో అదే గ్రామానికి చెందిన నాశిన పోలయ్య అనే వృద్ధుడు కొన్నిరోజుల నుంచి తలదాచుకుంటున్నాడు. స్థానిక యువకులు ఆయనకు ప్రతిరోజు కొంత ఆహారం పెట్టేవారు. కాగా ఆయన మంగళవారం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో పంచాయతీ కార్యదర్శి, సచివాలయ పోలీసులు 108 అంబులెన్స్ సాయంతో నెల్లూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మొక్కలు నాటి పరిరక్షించండి

• కమిషనర్ వికాస్ మర్మత్



అధికారులకు సూచనలు చేస్తున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): నగరంలోని డివైడర్లలో మొక్కలను నాటి సంరక్షించాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. మద్రాస్ బస్టాండ్, కేవీఆర్ కూడలి, కరెంటాఫీస్ సెంటర్ ప్రాంతాల్లోని ఐల్యాండ్స్, డివైడర్లను అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. పర్యావరణానికి మేలు చేకూర్చే మొక్కలను ఎంపిక చేసుకొని పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. క్రమం తప్పకుండా నీటిని సరఫరా చేయాలని కోరారు. అనంతరం పాత మున్సిపల్ కార్యాలయ సమీపంలో పునరావృతమైన స్పందన ఫిర్యాదు పరిష్కారానికి గానూ ఆయన పర్యటించారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

నగరంలోని కాలువల్లో పూడికతీత పనులు, మురుగు పారుదలకు చర్యలు, దోమల నిర్మూలన, తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ ఆదేశించారు. స్టోన్‌హౌస్‌పేట, రేబాలవారి వీధి, ఏసీనగర్, రామ్మూర్తినగర్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.

పన్నులను వసూలు చేయాలి

నగరపాలక సంస్థ పరిధిలో అస్తి, కుళాయి, డ్రైనేజీ పన్నులతో పాటు వాణిజ్య భవనాలకు సంబంధించిన బకాయిల వసూళ్లను వేగవంతం చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఈ మేరకు కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

ఓటర్ల జాబితా సవరణపై సమావేశం

ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థంగా నిర్వహిస్తున్నామని కమిషనర్ పేర్కొన్నారు. ఓటర్ల జాబితా సవరణపై జిల్లాలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని తన చాంబర్‌లో ఆయన నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున అశోక్, రాజీవ్ రెడ్డి, బాలశంకర్‌రెడ్డి, టీడీపీ తరఫున భువనేశ్వరి ప్రసాద్, సీపీఐ నుంచి సిరాజ్, షానవాజ్, రామరాజు, ఏఈఆర్వోలు దేవీకుమారి, దశయ్య, ఈడీటీ మాధవి తదితరులు పాల్గొన్నారు.

దసరా నాటికి జగనన్న కాలనీలు సిద్ధం

జగనన్న కాలనీల్లో నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి దసరా నాటికి గృహాలను సిద్ధం చేయాలని కమిషనర్ ఆదేశించారు. వెంకటేశ్వరపురంలోని లేఅవుట్, బిట్ – 2లో నిర్మాణ పనుల పురోగతిపై హౌసింగ్ విభాగం, నగరపాలక సంస్థ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

ఘనంగా వామన జయంతి



నెల్లూరు(బృందావనం): సుజాతమ్మ కాలనీలోని కృష్ణ యోగ మందిరంలో కొలువైన కృష్ణుడు త్రివిక్రముని అలంకారంలో మంగళవారం దర్శనమిచ్చారు. భాద్రపద శుక్ల ద్వాదశి, వామన జయంతిని పురస్కరించుకొని కృష్ణుడ్ని విశేషంగా అలంకరించారు. భక్తులు విశేషంగా హాజరయ్యారు. ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ గిరిజన కాలనీలో అన్నదానం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 53వ డివిజన్లో గల గాంధీ గిరిజన కాలనీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద అన్నదానాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత వెంకటరమణ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. పార్టీ నేతలు బాలశంకర్‌రెడ్డి, ముజీర్, వెంగళ్‌రెడ్డి, నాగరాజు, ఆదిశేషమ్మ, శివకుమార్, తిరుపతయ్య, అరుణ్, మహేష్, రాజేష్, వెంకటేశ్వర్లు, రవి తదితరులు పాల్గొన్నారు.

సన్మార్గంలో పయనించండి



న్యాయమూర్తికి సన్మానం

నెల్లూరు (లీగల్): జూనియర్ న్యాయవాదులు సన్మార్గంలో పయనించాలని మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కపర్ది పేర్కొన్నారు. బాపట్ల ఆరో అదనపు జిల్లా జడ్జిగా బదిలీపై వెళ్తున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి బాలాజీకి వీడ్కోలు సభను నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం నిర్వహించారు. నగరంలోని న్యాయవాదుల అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. కేసుల పరిష్కారంలో బాలాజీ ముందుండే వారని చెప్పారు. అనంతరం బాలాజీ మాట్లాడారు. నగరంలోని వీఆర్ లా కళాశాలలో చదివి పట్టభద్రుడ్ని అయ్యానని, జూనియర్ సివిల్ జడ్జిగా మొదటి పోస్టింగ్ నెల్లూరులోనే వచ్చిందని చెప్పారు. అనంతరం ఆయన్ను పలువురు సత్కరించారు. ఇద్దరు జూనియర్ న్యాయవాదులకు లా పుస్తకాలు, ఒక న్యాయవాద గుమాస్తాకు నగదును తన తండ్రి జ్ఞాపకార్థం బాలాజీ అందజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, ఉపాధ్యక్షుడు సుభానీ, ట్రెజరర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లాప్ మిత్రలకు సత్కారం



నెల్లూరు(పొగతోట): గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించిన క్లాప్‌మిత్రలను విజయవాడలో ఘనంగా సన్మానించారు. మనుబోలు మండలం జట్లకొండూరు, అక్కంపేట పంచాయతీల క్లాప్‌మిత్రలను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు, ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్, అడిషనల్ కమిషనర్ సుధాకర్ సత్కరించారు. క్లాప్‌మిత్రలు కృష్ణయ్య, అబ్దుల్లా, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణయ్యను డీపీఓ సుస్మితారెడ్డి అభినందించారు.

సమస్యల పరిష్కారానికి వినతి

నెల్లూరు రూరల్: ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. వెలగపూడిలో నిర్వహిస్తున్న శాసనమండలి సమావేశాల్లో నాలుగో రోజు మంగళవారం పలు అంశాలపై ఆయన మాట్లాడారు. జగనన్న గోరుముద్ద పథకాన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అమలు చేయడంతో పాటు అర్హత, నైపుణ్యం కలిగిన కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని కోరారు.

అభినందన

శాసనమండలిలో ప్రభుత్వం నూతనంగా నియమించిన ఏడు కమిటీల్లో రెండింటిలో ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డికి స్థానం దక్కింది. పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉపాధ్యాయులు అభినందనలను తెలియజేశారు.

ఎమ్మెల్యే సహకారంతో ఆజాద్ సెంటర్ అభివృద్ధి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ సహకారంతో నగరంలోని ఆజాద్ సెంటర్‌ను అభివృద్ధి చేయడంతో పాటు భగత్‌సింగ్, అష్ఫాఖుల్లాఖాన్, చంద్రశేఖర్ ఆజాద్, మౌలానా అబ్దుల్ కలాం లాంటి మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేస్తామని సీపీఐ నగర సహాయ కార్యదర్శి సిరాజ్ పేర్కొన్నారు. సీపీఐ సీనియర్ నేత అహ్మద్ బాషా వర్ధంతిని పురస్కరించుకొని నగరంలోని ఆజాద్ సెంటర్‌లో అన్నదానాన్ని మంగళవారం నిర్వహించారు. నేతలు అజీజ్ అహ్మద్, షానవాజ్, మున్నా, ముజీబ్, మల్లి, రియాజ్, సిరాజ్, జియా తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు రూరల్: వెంకటేశ్వరపురంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ సుధాకర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు వచ్చే నెల మూడులోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నేత్రపర్వంగా వెంకటేశ్వరుడి కల్యాణోత్సవం



నెల్లూరు(బృందావనం): శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని కనులపండువగా మంగళవారం నిర్వహించారు. పంచామృతాభిషేకాలు, పూజా కార్యక్రమాలను అర్చకులు విశేషంగా జరిపారు. గోవిందనామ స్మరణతో మందిరం పులకించింది. ఉభయకర్తలుగా తాతా వెంకటకిషోర్‌కుమార్, హేమలత దంపతులు వ్యవహరించారు. మందిర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అమర్తలూరు వెంకటేశ్వర్లుగుప్తా, సోమిశెట్టి వెంకటరత్నం, తన్నీరు మస్తాన్‌రావు తదితరులు పర్యవేక్షించారు.

నరసింహకొండలో విశేష పూజలు



నెల్లూరు రూరల్: వామన జయంతిని పురస్కరించుకొని నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలను మంగళవారం నిర్వహించారు. వామన విగ్రహం వద్ద పూజలు చేశారు. దేవస్థాన ఎదురుగా నూతనంగా నిర్మిస్తున్న రేకుల షెడ్డు వద్ద పూజలను సాయంత్రం చేపట్టారు. చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కాత్యాయని వ్రతం



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కాత్యాయని వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. విశేష పూజలను దేవస్థాన ప్రధానార్చకుడు సూరావఝుల రఘురామశర్మ ఆధ్వర్యంలో జరిపారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్, ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

ప్రయాణం.. ప్రమాదభరితం





నగరంలోని వెంకటేశ్వరపురం ఫ్లైఓవర్‌పై గుంతలు ఏర్పడి ఇనుప చువ్వలు దర్శనమిస్తున్నాయి. దీంతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఇనుప చువ్వలు గుచ్చుకొని టైర్లు పంక్చరవుతున్నాయి. వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

కేవీ రత్నానికి పరామర్శ



నెల్లూరు రూరల్: అనారోగ్యంతో బాధపడుతూ చెన్నైలోని గ్లోబల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రత్నం విద్యాసంస్థల అధినేత కేవీ రత్నాన్ని ఆస్పత్రి అధినేత డాక్టర్ కంచర్ల రవీంద్రనాథ్ మంగళవారం పరామర్శించారు. త్వరలో కోలుకొని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని భరోసా కల్పించారు. ఆస్పత్రిలోని వైద్యులు, సిబ్బంది తనపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని రత్నం పేర్కొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 53వ డివిజన్లో గల వెంకటేశ్వరపురం, పునరావాస కాలనీ ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను మంగళవారం చేపట్టారు. ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు ఇంటింటికీ వెళ్లి వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేసి మందులను అందజేశారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి



నెల్లూరు(మినీబైపాస్): నగరంలోని జాషువా ప్రజా గ్రంథాలయాన్ని కమిషనర్ వికాస్ మర్మత్ మంగళవారం సందర్శించారు. సమస్యలను ఆరాతీశారు. గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మౌలిక వసతులు, తాగునీరు, ఆధునిక టెక్నాలజీ, పుస్తకాలు, కంప్యూటర్లు, తదితరాలపై చర్చించారు.

ప్రజా పంపిణీ వ్యవస్థలో లోపాలు తలెత్తకూడదు



మాట్లాడుతున్న కూర్మనాథ్

నెల్లూరు(దర్గామిట్ట): ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించి కార్డుదారులకు అందించే సరుకుల తూకాల్లో తేడాలు రాకుండా చూడాలని జేసీ కూర్మనాథ్ ఆదేశించారు. కలెక్టరేట్లోని తన చాంబర్‌లో సీఎస్డీటీలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యావసర సరుకుల పంపిణీకి సంబంధించిన తూకాల్లో తేడాలొస్తున్నాయనే ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు. ప్రధానంగా బుచ్చిరెడ్డిపాళెం ఎమ్మెల్‌ఎస్ పాయింట్లపై ఫిర్యాదులొస్తున్నాయని పేర్కొన్నారు. కచ్చితమైన కొలతలతో సరుకులు ఎమ్మెల్‌ఎస్ పాయింట్ల నుంచి రేషన్ షాపులు.. అక్కడి నుండి మొబైల్ వాహనాలు.. వారి నుంచి కార్డుదారులకు అందేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ చివరి దశకు వచ్చిందని, బయట మార్కెట్లో ధరలెక్కువగా ఉండటంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని రైతులు తరలించడం లేదని చెప్పారు. ధాన్యం కొనుగోళ్లపై దృష్టి సారించి, రైతులు నష్టపోకుండా చూడాలని సూచించారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, ఇన్‌చార్జి డీఎం సివిల్ సప్లయ్స్ వెంకటేశ్వర్లు, ఏఎస్‌ఓ అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

